

విద్యతోనే బంగారు భవిష్యత్తు : పిఒ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: బడిఈడు పిల్లలందరినీ పాఠశాలలకు పంపించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సూచించారు. మండలంలోని కంద్రూం పంచాయతీ సర్రాయి గ్రామంలో రూ 3 లక్షలతో ఆధునికరించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పాఠశాలకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలని, బొమ్మలు వేయించాలని గ్రామస్తులు కోరగా వెంటనే పనులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ కె.వేణుగోపాల్, ఎఈ అభిషేక్, సర్పంచ్ కిముడు హరి, ఎంపీపీ ఎస్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న పిఒ

జిల్లాలో పర్యాటక శాఖల..

ప్రయివేటీకరణను విరమించుకోవాలి

◆ తక్షణమే టెండర్ విధానం రద్దు చేయాలి ◆ సిపిఎం, సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి-అనంతగిరి: పర్యాటక శాఖలను ప్రయివేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను తక్షణమే విరమించుకుని, ప్రభుత్వ ఆధీనంలో నడపాలని స్థానిక సిపిఎం జెడ్పిటిసి డి.గంగరాజు, సిఐటియు మండల కార్యదర్శి కె.మొస్య లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా 5వ షెడ్యూల్ ఏరియాలోని గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టం ఉల్లంఘించి పర్యాటక శాఖ ఆస్తులు ప్రైవేటు పరం చేస్తూ బడా బాబులకు, ఇతర వ్యక్తులకు అప్పగించడం చట్ట విరుద్ధమని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఖజానాను నింపుకునేందుకు ఇటువంటి ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు.పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో ఉన్న టైడా జంగిల్ బీల్స్, అనంతగిరి హరిత రిషార్ట్, అరుకు మయూర్సి, లంబసింగులో కొత్తగా నిర్మించిన రిషార్ట్లను ప్రైవేటు పరం చేసేందుకు సన్నాహాలు చేస్తుందని, ఈ ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని రిషార్ట్స్ లాభాల్లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి నడపడం చేత కాకపోతే గిరిజన సోసైటీలకు లేదా స్థానిక పంచాయతీకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రయివేటు టెండర్ రద్దు చేయాలి

అరకులోయరూరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఈ నెల 22న జారీ చేసిన ప్రయివేట్ టెండర్ను వెంటనే రద్దు చేయాలని, లేకుంటే న్యాయపోరాటం చేస్తామని ఆదివాసి గిరిజన జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసి) ఈనెల 22న జారీ చేసిన టెండర్ను తక్షణమే రద్దు చేయాలన్నారు. షెడ్యూల్ ఏరియాలో ఆదివాసీ హక్కులు, చట్టాలను ఉల్లంఘించి జగన్ ప్రభుత్వం ప్రయివేట్ వ్యక్తులకు టెండర్ కట్ట బెట్టేందుకు చూస్తోందని విమర్శించారు. అరకువేలి, అనంతగిరి, చింతపల్లి మండలాల పరిధిలోని టైడా, అనంతగిరి హిల్స్, మయూరి హిల్ రిసార్ట్స్, లంబసింగి యూనిట్లను ప్రవేట్ వ్యక్తులకు అప్పగించడం కోసం టెండర్ ప్రక్రియకు తెరలేపిందని విమర్శించారు.

గిరిజనల హక్కులు, చట్టాలకు తూట్లు

అరకులోయ : గిరిజన ప్రాంతంలో 5వ షెడ్యూలు, 1/70 చట్టం అమల్లో ఉండగా ఈ టెండర్ పేరుతో టూరిజం శాఖ హెూటల్స్లను ప్రైవేట్ వ్యక్తులకి కట్టబెట్టడం గిరిజన హక్కులు, చట్టాలు ఉల్లంఘించడమేనని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు విమర్శించారు. గురువారం అరకువేలీ గిరిజన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు స్. బి.పోతురాజు, కే.మగ్గన్నతో కలిసి మాట్లాడారు. ప్రతి సంవత్సరం జిల్లాలో ఉన్న ఐదు యూనిట్ల నుండి రూ.20 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని, వీటిని వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు అనుచరులకు లబ్ధి పొందేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు.కార్పొరేషన్ హెూటల్స్ని ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే హక్కు ప్రభుత్వానికి లేదని, ఇది ప్రజల ఆస్తిని తెలిపారు. ప్రైవేటీకరణతో కార్మికులకు తీవ్రం నష్టం వస్తుందన్నారు. టెండర్ రద్దు చేయకపోతే ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న జెడ్పిటిసి గంగరాజు


నిరసన తెలుపుతున్న పిప్పలదొడ్డి, గొడుగుమామిడి గ్రామాల గిరిజనులు

రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనుల నిరసన

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దామనపల్లి పంచాయతీ పిప్పలదొడ్డి, గొడుగు మామిడి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గురువారం ఆ గ్రామ గిరిజనులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం తిప్పలదొడ్డి బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా నేటికీ తమ గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్మిస్తామని హామీలు ఇవ్వడమే తప్ప ప్రభుత్వంగాని, ప్రజాప్రతినిధులుగాని, అధికారులుగాని ఆ హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. గిరిజనుల పట్ల ఇంత నిర్లక్ష్యం సరికాదన్నారు. పిప్పళ్ళదొడ్డి నుంచి గొడుగుమామిడి వరకు కంకర వేసి తారు రోడ్డు వేయకుండా విడిచి పెట్టారని ఆరోపించారు. లింగవరం, మోదుగు బంధ, తిప్పలదొడ్డి, గొడుగు మామిడి మీదగా దామనాపల్లి లంకవీధి వరకు తారు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించుకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాగిన రామచంద్ర, మురళి, చెన్నారావు, సాగిన చిన్నయ్య పడాల్, సాగిన శ్రీహరి, సిందేరి రాజు, మరి అప్పలరాజు, పాంగి సన్యాసిరావు, దుక్కేరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 278 సెల్ టవర్లు ఏర్పాటు

-వర్చువల్ విధానంలో ప్రారంభించిన సిఎం జగన్

ప్రజాశక్తి-పాడేరు: మారుమూల గిరిజన గ్రామాలకు నెట్ వర్క్ సదుపాయాలు కల్పించేందుకు గాను పాడేరు మండలం సలుగు పంచాయతి ఈదులపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విదానంలో జిల్లాలో 278 సెల్ టవర్లను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గత జూన్ నెలలో 100 సెల్ టవర్లను ప్రారంభించామని, ఇప్పుడు మరో 278 సెల్ టవర్లను ప్రారంభిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, గిరిజన గ్రామాలకు సెల్ టవర్లు ఏర్పాటు చేయడంలో ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. స్థానిక శాసన సభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, గిరిజనులపై ముఖ్యమంత్రికి ఉన్న ప్రత్యేక అభిమానంతోనే ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయడమే కాకుండా, అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. సెల్ టవర్లు ఏర్పాటుపై సంతోషాన్ని వ్యక్త పరిచిన ఓ చిట్టమ్మ ముఖ్యమంత్రితో వర్చువల్ విధానంలో మాట్లాడుతూ, ప్రతి చిన్న అవసరానికి సిగ్నల్ కోసం ఎత్తైన కొండలపైకి వెళ్లి ఫోన్ చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు తమ గ్రామం చుట్టూ నాలుగు సెల్ టవర్లు రావడంపై సంతోషం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, సలుగు సర్పంచ్ గెమ్మెలి అప్పలకొండ, ఎంపీటీసీ దూసూరు మీనా, దేవాపురం సర్పంచ్ కిల్లు పరమేశ్వరి, వంటల మామిడి సర్పంచ్ పాంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే,తదితరులు


డుంబ్రిగుడ: మండలంలోని లైగండ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎయిర్టెల్ సెల్ టవర్ ను ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ప్రతి ఇంటికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడానికి ముందడుగు వేస్తున్నామన్నారు.ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శంగా అందించడానికి మొబైల్ నెట్వర్క్ కనెక్టివిటీ సౌకర్యాన్ని కల్పిస్తుంన్నారు.ఉమ్మడి విశాఖ జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్ జె.సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తిక్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, తహశీల్దారు నాగమ్మ, గిరిజన సంక్షేమ శాఖ ఏఈఈలు అభిషేక్, ధ్రువ, ఎంపిడిఓ బి.ఉషారాణి, ఎం.పి.పి. ఈశ్వరి, జడ్పిటిసిలు జానకమ్మ, అర్.మత్స్యలింగం, సర్పంచ్ శాంతి, తదితరులు పాల్గొన్నారు.


రామలక్ష్మిని పరామర్శిస్తున్న సిఐటియు నేతలు వాణిశ్రీ, వెంకట్ తదితరులు

అనారోగ్యానికి గురైన అంగన్వాడీకి పరామర్శ

ప్రజాశక్తి-రంపచోడవరం

అంగన్వాడీల సమ్మెలో భాగంగా అమరావతిలో ఐదు రోజులపాటు నిరాహార దీక్షలో పాల్గొని అనారోగ్యానికి గురైన ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి కె.రామలక్ష్మిని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.నిర్మల గురువారం పరామర్శించారు. రామలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, కె.శాంతి రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.రాణి, కె.వెంకటలక్ష్మి, సిహెచ్.కుమారి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

తునికాకు బోనస్ బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-చింతూరు

2012 నుండి తునికాకు కార్మికులకు రావలసిన బోనస్ బకాయిలను చెల్లించాలని సిపిఎం విలీన నాలుగు మండలాల ప్రతినిధి బృందం చింతూరు డిఎఫ్ఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఎలీషాకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, యర్రంశెట్టి శ్రీనివాస్, పూణెం సత్యనారాయణ, విఆర్పురం ఎంపీపీ కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శులు సోయం చిన్నబాబు, సీసం సురేష్, పాయం సీతారామయ్య, కాక అర్జున్, సర్పంచ్ నాగమణి, రాము తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సందడి

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం మారుమూల గిరిజన గ్రామాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. మండలంలోని గుమ్మరేవుల పంచాయతీ కనుసమెట్ట గ్రామంలో గిరిజనులు బుధవారం రాత్రి భోగి, సంక్రాంతి పండుగలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు పాటు, జీకే వీధి మండలం దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులు పంచాయతీల పరిధిలో గిరిజనులు గత వారం రోజులుగా భోగి సంక్రాంతి పండుగలు నిర్వహించుకుంటున్నారు. బంధుమిత్రులను పిలిచి వివిధ రకాల పిండి వంటలు, రుచికరమైన భోజనాలు తయారుచేసి ఆనందోత్సవాలతో థింసా నృత్యాలు చేస్తూ సహంపక్తి భోజనాలు చేశారు. దీంతో పలు గిరిజన గ్రామాల్లో తీర్థాలను తలపించే విధంగా సందడి వాతావరణం నెలకొంది.


థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా ఫరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్టులు పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఖాళీగా ఉన్న 49 అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు 2024 జనవరి 26 నుండి ఫిబ్రవరి 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా సంబంధిత శిశు అభివద్ధి పథకం అధికారికి నేరుగా గాని పోస్ట్ ద్వారా గాని దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త, ఆయా, మినీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తు చేసుకునే మహిళలు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణత, స్థానికంగా నివాసం, వివాహిత స్త్రీ అయి ఉండాలని కలెక్టర్ తెలిపారు. 2023 జూలై 1 నాటికి అభ్యర్థులు 21 సంవత్సరములు పూర్తి చేసి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. 21 సంవత్సరాల లోపు అభ్యర్థులు లభించని పక్షంలో 18 సంవత్సరాలు పూర్తయిన వారి దరఖాస్తులు పరిశీలించబడతాయని, ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు కేటాయించిన కేంద్రాలకే వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఎంపికలో పదవ తరగతి ఉత్తీర్ణత 50 మార్కులు, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ఐదు మార్కులు, వితంతువులకు ఐదు మార్కులు, మైనర్ పిల్లలు కలిగి ఉన్న వితంతువులకు ఐదు, పూర్తి అనాథ, క్రెచ్, హెూమ్, ప్రభుత్వ సంస్థలలో నివశించు సత్ప్రవర్తన సర్టిఫికెట్ కలిగిన వారికి 10, అర్హత కలిగిన వికలాంగ వ్యక్తులకు ఐదు, మౌఖిక పరీక్షకు 20 మార్కులు మొత్తం 100 మార్కులకు ఉంటుందని తెలిపారు. మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు జరుగుతాయని, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని, అర్హతలను, మార్కులను పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. పూర్తి వివరములకు సంబంధిత ఐసిడిఎస్లలో సంప్రదించాలని సూచించారు.

29న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-పాడేరు: యువత ముందున్న సవాళ్లపై అవగాహన కల్పించేందుకు విజయవాడలో ఈ నెల 29న ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండల కార్యదర్శి ముువ్వల లక్ష్మణ్ తెలిపారు. సదస్సు పోస్టర్లను గురువారం పాడేరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు ఉద్యోగాలు, ఉపాధి కరువైందన్నారు. యువతకు విద్య, ఉపాధి అవకాశాల్లో శ్రీలంక, నేపాల్ కన్నా వెనకబడి ఉన్నామని తెలిపారు.డిగ్రీలు . పీ.జీ.లు, పీ.హెచ్.డి.లు బి.టెక్ చదివినవారు చిన్న ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అఖిల్ బడ్నాయిని, రాజగోపాల్, శ్రీను, సిదరి చిన్నయ్య, సన్యాసిరావు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన ప్రాంతంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గురువారం కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు: ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ మాట్లాడుతూ, పెండింగ్లో ఉన్న హౌసింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర, పోడు పట్టాలు మంజూరు చేయాలన్నారు. కాఫీ రైతులకు బకాయి బిల్లును తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్లు మరమ్మతు చేయాలన్నారు. గిరిజన ప్రాంతంలో తాగు, సాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్కు గిరిజన సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు. విష్ణుమూర్తి, ఈ పోతురాజు, డి.కృష్ణ, కూడా రాధాకృష్ణ, సెగ్గే సత్తిబాబు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నేతలు

మోటారు కార్మికులు సంఘటితంగా ముందుకెళ్లాలి

ప్రజాశక్తి -అనంతగిరి

తమ సమస్యల పరిష్కారానికి మోటారు కార్మికులంతా యూనియన్గా ఏర్పడి సంఘటితంగా ముందుకు సాగాలని స్థానిక జెడ్పిటిసి, సిపిఎం నేత దీసరి గంగరాజు, సిఐటియు మండల కార్యదర్శి కె.మొస్య పిలుపునిచ్చారు. ఇతర కార్మిక సంఘాలతో కలిసి పరస్పర సహకారం అందించుకోవాలన్నారు. గురువారం గంగమ్మతల్లి మోటారు కార్మికుల యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ రవాణాశాఖ నిబంధనలను పాటిస్తూ, ప్రజలకు మెరుగైన రవాణా సేవలను అందించాలని కోరారు. మండలంలోని వేంగడ, వాలాసి, లుంగపర్తి, పెద్దబిడ్డ, గుమ్మ, డముకు తదితర పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి రవాణా అవసరాలను తీర్చడం అభినందనీయమన్నారు. సిఐటియు మండల కార్యదర్శి కె.మొస్య మాట్లాడుతూ అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులంతా యూనియన్లో సభ్యత్వం పొందాలని సూచించారు. కష్టసుఖాల్లో కార్మికులంతా సంఘటితంగా పరస్పర సహకారం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు

నూతన కార్యవర్గం ఎన్నిక

డముకు వ్యూపాయింట్ పరిధిలోని ఆరు పంచాయతీలకు చెందిన గంగమ్మ తల్లి మోటారు కార్మికుల యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు, సిఐటియు మండల కార్యదర్శి కె.మొస్య ఆధ్వర్యంలో నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులుగా నేగల సుందరరావు, సెక్రటరీగా మాదాల రాము, కోశాధికారిగా సేంబి సుందరరావు, వైస్ ప్రెసిడెంట్గా మాదల రాము, జాయింట్ సెక్రటరీగా విశ్వనాథం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మోటార్ కార్మికులు కె.శామ్యూల్ పాల్గొన్నారు

పెద్ద ఆర్యూరు సమస్యలపై ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని పెద్ద ఆర్యూరు గ్రామపంచాయతీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని స్థానిక సర్పంచ్ నాగమణి చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గండి కొత్తగూడెం గ్రామం బ్రిడ్జి పెండింగ్ పనులు పూర్తి చేయించాలని కోరారు. గతంలో కొండరెడ్ల కుటుంబాలకు ఇళ్లు మంజూరయ్యాయని, వాటి పనులు ప్రారంభించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు. పెద్దఆర్యూర్ చర్చి దగ్గర ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్కు మరమ్మతులు చేయించడానికి, గ్రామంలో మధ్య గుంపుకు పైప్లైన్ వేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా ఐటిడిఎ పిఒ స్పందించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.


ఐటిడిఎ పిఒ చైతన్యను కలిసిన సర్పంచ్ నాగమణి

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని తామరపల్లి పంచాయతీ సచివాలయంలో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గురువారం సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ముసురుమిల్లి ఎంపీటీసీ వంశి కుంజం మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఇంటి పన్నులు కట్టాలని, తద్వారానే పంచాయతీ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. పంచాయతీ అభివృద్ధిని అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో వీధి దీపాలు వెలిగేలా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని వాటర్ లీకేజీని పంచాయతీ కార్యదర్శి చూపించగా శుక్రవారం లోగా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సోదే చిట్టిదొర, కార్యదర్శి భారతి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు

28న చలో రాజమండ్రికి తరలిరండి
-యుటిఎఫ్


వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -అనంతగిరి : రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్న డిమాండ్‌తో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 28న చలో రాజమండ్రి సభకు తరలిరావాలని అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ కార్యదర్శి పుడిగి దేవుడు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం విధులు ముగిసిన తర్వాత శివలింగాపురం బాలుర పాఠశాల వద్ద చలో రాజమండ్రి ఆందోళనకు సంబంధించి వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ అనంతరం, జీవనభృతికి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల కనీస హక్కు అయిన పాత పింఛను విధానాన్ని సాధించుకునేందుకు జరుపుతున్న పోరాటంలో భాగంగా చలో రాజమండ్రి ఆందోళనకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా సహ అధ్యక్షులు శెట్టి రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు, యుటిఎఫ్ మండల ప్రతినిధులు పివి.రమణ, వి.గంగరాజు, నాగేశ్వరరావు, సుధారాణి, నారాయణరావు, సత్యనారాయణ, మోహనరావు, సింహాచలం, రామ్‌గోపాల్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంభనకు 'ఆసరా'


చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-జి.మాడుగుల: డ్వాక్రా మహిళలకు ఆర్థికంగా చేదోడు, వాదోడుగా ఉండాలన్న సంకల్పంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వైఎస్ఆర్ ఆసరా పథకం కింద ఆర్థికసాయం అందించారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోనిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా సంబరాలలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు పాల్గొన్నారు. డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద ఆర్థికసాయం నమూనా చెక్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల ఆర్థికస్వావలంభనకు వైసిపి ప్రభుత్వం అందిస్తున్న ఆసరా సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనుల అభ్యున్నతికి సిఎం జగన్మోహన్ పథకాలు పెట్టారన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

27న వైసిపి బహిరంగ సభ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఈనెల 27న విశాఖ జిల్లా భీమిలిలో జరిగే వైసిపి బహిరంగ సభను జయప్రదం చేయాలని అరకు అసెంబ్లీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే ఆశావాహులు సమర్ది రఘునాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని కితలంగి పంచాయతీ పూలుగుడ గ్రామంలో బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ వైసిపి నాయకులు గురువారం ప్రతి గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ వాలంటీర్ల వ్యవస్థతో ప్రతి ఒక్కరికి తమ ఇంటి వద్దనే సంక్షేమ పథకాలను వైసీపీ అందిస్తుందన్నారు.నాలుగు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా మారుమూల గ్రామాల్లో సైతం ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసి టి.రాందాస్, మాజీ వైస్ సర్పంచ్ కే.సత్యానందం, పూర్ణ, మాజీ సర్పంచ్ బి చెల్లయ్య, జి బాబురావు పాల్గొన్నారు.

2న భారత్ ఆదివాసీ పార్టీ సభ

ప్రజాశక్తి- పాడేరు : భారత్ ఆదివాసీ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖను వచ్చేనెల 2న పాడేరులో ప్రారంభిస్తున్నట్లు ఆపార్టీ జాతీయ అధ్యక్షులు మోహన్‌లాల్ రోత్ తెలిపారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, 2023 సెప్టెంబర్ 10న రాజస్థాన్ కేంద్రంగా ఆవిర్భవించిన పార్టీ మూడు నెలల్లోనే జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి రాజస్థాన్‌లో ముగ్గురు, మధ్యప్రదేశ్‌లో ఒకరు ఎమ్మెల్యే స్థానాలను గెలుపొందిందన్నారు. పార్టీని జాతీయస్థాయిలో మిగతా రాష్టాలలో విస్తరించే దిశగా ఏపీలోనూ వచ్చేనెల 2న రాష్ట్రశాఖ ఏర్పాటుతోపాటు రాష్ట్ర కార్యనిర్వహణ కమిటీని ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో గెలుపొందిన ఎమ్మెల్యేలు రాజ్‌కుమార్ రోత్, తవర్ చాంద్, ఉమేష్ మీనా, కమలేశ్వర్ దొడియార్‌తోపాటు ఆయా రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, ముఖ్యనేతలు హాజరౌతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, మన్యం పార్వతీపురం, అల్లూరి, ఏలూరు జిల్లాల ఆదివాసీ నేతలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అవినీతి తోటలో 'రోజా'
రాష్ట్ర పర్యాటక మంత్రిపై తెలుగు మహిళ అనిత ధ్వజం


మాట్లాడుతున్న తెలుగు మహిళ అనిత

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం) : అవినీతి తోటలో విరబూసిన పుష్పం రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్‌కె.రోజా అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. గురువారం జిల్లా టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నగిరి మున్సిపల్ చైర్మన్ పదవిని వేలంలో పెట్టి, దళిత మహిళా కౌన్సిలర్‌కు మున్సిపల్ చైర్మన్‌ను చేస్తానని నమ్మబలికి రూ.70 లక్షలు డిమాండ్ చేసి, రూ.40 లక్షలు తీసుకుందని ఆరోపించారు. ప్యాకేజీలు, పైసాలకు ఆశపడి వైసిపిలోకి చేరిందే తప్ప, రోజాకు ప్రజా సేవ చేయాలన్న యావ లేదన్నారు. నగిరి నియోజకవర్గంలో మండలానికో బినామీని పెట్టి, మంత్రిగా అక్రమ వసూళ్లతో 9 నెలల్లోనే వందల కోట్లకు అధిపతి అయిందన్నారు.జగన్ పుట్టినరోజు పేరు చెప్పి రూ.29 కోట్లు కొట్టేసిందన్నారు. ఆర్‌డిఒ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమస్యలు సృష్టించడం, వాటి పరిష్కారం పేరుతో అక్రమాలకు పాల్పడడం, గ్రావెల్ దందాలు పరిపాటిగా మారిందన్నారు. ఆర్ టాక్స్ కట్టకుండా నగరిలో పనులు జరగడం లేదంటే, అక్కడ అవినీతి, అక్రమాలు ఏ స్థాయికి చేరాయో స్పష్టమౌతోందన్నారు. తిరుమల వెంకన్న దర్శనాల పేరుతో నెలకు రూ.20 లక్షలను మంత్రి రోజా సంపాదిస్తోందంటే,ఆమె అవినీతి ఏస్థాయిలో ఉందో స్పష్టమౌతోందన్నారు. జగన్ అధికారంలోకి రావడానికి కారణమైన షర్మిలనే మరిచిపోవడం వారి నైజానికి నిదర్శనమన్నారు. మంత్రి రోజాను చీదరిస్తూ, ఛీకొడుతూ నగరి జనాలు, నేతలు విమర్శిస్తున్నారన్నారు.

లెక్చర్ సిరీస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించే లెక్చర్ సిరీస్ పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వర్తమాన సమాజంలో గాంధీజీ ఆలోచనల ఆవశ్యకత అనే అంశంపై గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యాన లెక్చర్ సిరీస్‌ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

- పలుచోట్ల అవగాహనా ర్యాలీలు
- మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ
- యువ, వృద్ధ ఓటర్లకు ఘన సత్కారం


పాడేరులో మానవహారంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పలుచోట్ల నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి, ప్రతిఒక్కరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. సీనియర్, యువ, వికలాంగ ఓటర్లను ఘనంగా సత్కరించారు.

(ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం)

ప్రజాశక్తి - పాడేరు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, దీన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మన భవిష్యత్‌ను మనమే చక్కదిద్దుకోవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఓటరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులో నచ్చిన వ్యక్తి లేకుంటే నోటాకు ఓటేయడం ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియపరచవచ్చన్నారు. ఈ సందర్భంగా 80ఏళ్లు పైబడిన సీనియర్ ఓటర్లను, ట్రాన్స్‌జెండర్ ఓటర్లను, పివిటిజి ఓటర్లను సత్కరించారు. యువ ఓటర్లకు గుర్తింపు కార్డులుఅందజేశారు. కలక్టరేట్ వద్ద మానవహారం ఏర్పడి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వివి రమణ, ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.అంబేద్కర్, పి మురళికృష్ణ, వివిఎస్ శర్మ, తహసిల్దార్ త్రినాధరావు నాయుడు పాల్గొన్నారు.

అరకు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మండల తహశీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యువ, వృద్ధ ఓటర్లను దుశ్శాలువాతో సత్కరించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ.18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకుని తమకు నచ్చిన నేతను ఎన్నుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. ఎంపిడిఒ సిహెచ్ వెంకటేష్, కళాశాల ప్రిన్సిపల్ భరత్‌కుమార్ నాయక్, రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అరుకులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పెదబయలు : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఓటరు, లకేపుట్టు మాజీ వార్డు సభ్యుడు పాంగి ధర్మన్నను తహసీల్దార్ చిరంజీవి పడాల్ సన్మానించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేపించారు కార్యక్రమంలో డిటి రంగారావు, ఎంఆర్ఐ రీమెలి సింహాచలం, పాంగి కిరణ్‌కుమార్, హెచ్‌ఎం, పలాసి తిరుపతిరావు మాస్టారు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వృద్ధ ఓటర్లను సత్కరించారు. ఓటు వినియోగం పై అవగాహన కల్పించారు. హెచ్‌డిటి ముజీబ్, ఆర్ఐ జి.హరి, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సీలేరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని నినాదాలు, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాయిరాం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీలేరు జిల్లా పరిషత్తు హైస్కూల్ పోలింగ్‌స్టేషన్‌లో ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో పాల్గొని విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది కుసుమ, మహిళా పోలీస్ రేవతి, వెల్ఫేర్ అసిస్టెంట్ లోవకుమారి, వెటర్నరీ అసిస్టెంట్ అనుష్క వాలంటీర్లు పాల్గొన్నారు.

విఆర్.పురం : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చిచ్చడి.బాబురావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో తహశీల్దార్ ఎన్. శ్రీధర్, ఎఎస్‌డిఎస్ సంస్థ ప్రతినిధి ఉండవల్లి గాంధీబాబు పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. 18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదై ఓటు హక్కు వినియోగించుకోవాలని, 18ఏళ్లలోపు విద్యార్థులంతా తమ తల్లిదండ్రులకు ఓటు వినియోగించుకోవాలని చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు శిరమయ్య, వెంకటలక్ష్మి, పిడి అనిల్ పాల్గొన్నారు

నిర్భయంగా ఓటేయండి : సబ్ కలెక్టర్ ప్రశాంత్

రంపచోడవరం : ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీని ప్రారంభించారు. దేవీపట్నం సెంటర్‌లో ఓటర్లు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం లెనోవా కళాశాల ప్రాంగణంలో సమావేశంలో మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవడంతోపాటు, ఇతరులకు



రంపచోడవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

తెలియజెప్పాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ కె.అబూసలాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్‌రాజు మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా పేర్లు నమోదుచేసుకుని నచ్చిన వారికి ఓటేయాలన్నారు. సిఐ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రశాంతంగా ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన శాంతియుత పరిస్థితులను పోలీసుశాఖ కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల నమోదు, జాబితా సవరణ ప్రక్రియలో సమర్థవంతంగా పనిచేసిన బిఎల్‌ఒలు సుధాప్రకాష్,ఎం.ఆనందీశ్వరరావు ఎస్‌కె భాషా, సిహెచ్ రమాదేవి, కె. చిన్నారెడ్డి, ఎం.రామతులసి జి. లీలాప్రభాకర్ రావులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. యువ, సీనియర్, వికలాంగ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పివిజె కుమార్, డిటిలు ఎన్‌వివి సత్యనారాయణ, బి. రాజు, ఎలక్షన్స్ సీనియర్ అసిస్టెంట్లు డి ఇందిరాభాయి, టి.లక్ష్మణరావు, మణికంఠ ఎస్ఐ ఎంఆర్‌కె.రాజు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కాలేజీ నుంచి చింతూరు సెంటర్ వరకు విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ర్యాలీ నిర్వహించి, ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన ఓటరు అవగాహన సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ ఓటు హక్కు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని 18ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్, అర్థశాస్త్ర విభాగాదిపతి జి వెంకటరావు ప్రజాస్వామ్యంలో ఓటు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వై.పద్మ, కె. శకుంతల, జి.హారతి, కె.శ్రీదేవి, నూనె రమేష్, పి. ఏడుకొండలు, జి. సాయికుమార్, అలివేలు, శీనయ్య, సంగం నాయుడు పాల్గొన్నారు.



చింతూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు


డుంబ్రిగుడలో సీనియర్ ఓటర్లకు సత్కారం



సీలేరులో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన


పెదబయలులో వృద్ధ ఓటర్లను సత్కరిస్తున్న అధికారులు

సీనియర్లకే టిడిపి టికెట్ కేటాయించండి

ప్రజాశక్తి -పాడేరు : పాడేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ టిక్కెట్‌ను నియోజకవర్గంలోని స్థానికులైన సీనియర్లలో ఎవ్వరికిచ్చినా, అందరం సమిష్టిగా పనిచేసి గెలిపించుకుంటామని టిడిపి నేతలు ప్రకటించారు. గురువారం పాడేరులో మాజీ మంత్రి మణికుమారి, కొట్టగుల్లి సుబ్బారావు, బొర్రా నాగరాజు, ఎంవివి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐదు మండలాల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కూడా పాడేరు అసెంబ్లీ స్థానాన్ని తెలుగుదేశంపార్టీ పోగొట్టుకుందని, అది పునరావృతం కాకుండా, అధిష్టానం ఆలోచన చేసి తెలుగుదేశం పార్టీ సీనియర్లు గుర్తించి సీటు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్లు దుచ్చేరి చిట్టిబాబు, బుర్ర విజయరాణి, జడ్పీ మాజీ చైర్మన్ జి శ్రీరామమూర్తి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు బి బాలరాజు, బేరా సత్యనారాయణ, మండల పార్టీ ప్రెసిడెంట్‌లు ఎం.మచ్చరాజు, ఉల్లి రామారావు, వి పిన్నయ్య దొర, మాజీ సర్పంచ్‌లు కిముడు నారాయణ , ఎస్ నాగబ్బాయి, కిముడు లక్ష్మయ్య, లోతా భీమరాజు, బీసీ నాయకులు గోపి, టిఎన్ఎస్ఎఫ్ నేత వినోద్, ఎం కొండబాబు, పివిటిజి నాయకులు, బిసి నాయకులు ప్రశాంత్, కించే రమణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లీసులకు పట్టుబడిన నాటుసారా నిందితులు

28న ఖాదియానీ జమాత్ సమావేశాన్ని రద్దు చేయాలి


కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్లిన ముస్లిములు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం): ఈ నెల 28న గ్రీన్‌పార్క్ హోటల్‌లో ఖాదియానీ జమాత్ నిర్వహించే సమావేశాన్ని రద్దు చేయాలని విశాఖ జిల్లా ఆల్ మస్జిద్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. గురువారం జగదాంబ మక్కా మసీదు నుండి ముస్లిములు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్లను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అంతకుముందు మసీదు వద్ద సమావేశంలో అల్మాస్ అధ్యక్షులు అహ్మదుల్లా ఖాన్ మాట్లాడుతూ అమాయక ముస్లిములను మోసం చేసే ఉద్దేశంతో ఖాదియాని జమాత్ ఇటువంటి సమావేశాలు నిర్వహిస్తోందన్నారు. వారు నిజమైన ముస్లిములు కాదని, ఈ ఖాదియాని జమాత్‌కు ఇస్లాంతో ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ వర్గాన్ని భారత్‌తోపాటు పలు దేశాలలోను నిషేధించారన్నారు. మక్కా మసీద్ అధ్యక్షులు అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ గతంలో విజయవాడ, గుంటూరు, హైదరాబాదులో సమావేశాల నిర్వహణకు వీరు యత్నిస్తే అక్కడివారు తరిమికొట్టారన్నారు. వీరి వల్ల ముస్లిములకే కాకుండా, హిందూ, క్రైస్తవుల మనోభావాలు దెబ్బతింటున్నా యన్నారు. కార్యక్రమంలో నరవ మదర్స్ ప్రిన్సిపాల్ ముతియు రెహమాన్, ఎక్యూజె ఫరూఖీ, హైదర్ ఆలి సింకా పాల్గొన్నారు.

చెస్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తలపెట్టిన 2వ ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను స్థానికంగా గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నీ ఈ నెల 28వ తేదీ వరకూ కొనసాగనుంది. ప్రారంభ వేడుకకు ఎయు స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ విజయమోహన్, వాగ్దేవి ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ టోర్నీలో 419 మంది క్రీడాకారులు పాల్గొన్నారని శ్రీ చెస్ అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్, టోర్నమెంట్ డైరెక్టర్ ఆర్.బాబూరావు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నీని ప్రారంభిస్తున్న అతిథులు

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు రచించిన సోషిలాజికల్ పర్‌స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వర్తమాన సమాజానికి ఉపయుక్తంగా రాసిన రచయిత ఆచార్య షారోన్ రాజును వీసీ అభినందించారు. ఆచార్య షారోన్‌రాజు మాట్లాడుతూ, విద్యార్థులకు, పరిశోధకులకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, పూర్వ పాలక మండలి సభ్యులు గిరిజా అగస్టీన్, సిడిసి డీన్ ఆచార్య సిఎన్‌వి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి
60:40 లబ్ధిదారుని వాటాను సవరించాలి
హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సమావేశంలో తీర్మానం


సమావేశమైన జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- కలెక్టరేట్ : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, నగరానికి చేరువగా స్థలాలు కేటాయించాలని, 60:40 లబ్ధిదారుని వాటాను సవరించాలని, ఈ ఏడాది అక్రిడిటేషన్ లేనివారికి న్యాయం చేయాలని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. గురువారం సొసైటీ అధ్యక్షులు బి.రవికాంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాల జిఒలో పేర్కొన్న 60:40 నిష్పత్తిని సవరించాలని. లబ్ధిదారుల వాటాను వాయిదాల పద్ధతిలో చెల్లించే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈఏడాది అక్రిడిటేషన్ లేనికారణంగా సొసైటీలోని దాదాపు 250 మంది సభ్యులు ఇళ్ల స్థలాలకు అర్హత కోల్పోయారని, వారికీ న్యాయం చేయాలని కోరారు. కోవిడ్, ఇతర అనారోగ్యం, ప్రమాదాల్లో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు కూడా మానవీయకోణంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. సమావేశంలో సొసైటీ గౌరవాధ్యక్షులు జి.జనార్దనరావు, సలహాదారు ధవళేశ్వరపు రవికుమార్, ఉపాధ్యక్షులు కొయిలాడ పరుశురాం, మురళీకృష్ణారెడ్డి, కోశాధికారి శరత్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులు పి.ఎ.రావు, బొప్పన రమేష్, సంయుక్త కార్యదర్శులు అనురాధ, బి.శివప్రసాద్, చిట్టిబాబు, ప్రత్యేక ఆహ్వానితులు యర్రా నాగేశ్వరరావు, కార్యవర్గసభ్యులు కీర్తన్‌రావు, శీనివాసరావు, లక్ష్మణరావు, జయలక్ష్మి, స్వామి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాటుసారాతో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలోని నుర్మతి పంచాయతీ వాకపల్లి టీజంక్షన్ వద్ద గురువారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో నాటుసారా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నుర్మతి గ్రామానికి చెందిన నిందితుల నుండి నల్లబెల్లం సారాను స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు


పోలీసులకు పట్టుబడిన నాటుసారా నిందితులు